ప్రజాశక్తి
గురువారం 24 అక్టోబరు 2024
5
శ్రీకాకుళం

నేడు సెమినార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన 'ప్రజాస్వామ్య భారతం - జమిలీ ఎన్నికలు' అనే అంశంపై నగరంలోని బాపూజీ కళామందిర్‌లో గురువారం సాయంత్రం 5.30 గంటలకు సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కన్వీనర్ వి.జి.కె మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌కు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ, రచయిత అట్టాడ అప్పలనాయుడు హాజరు కానున్నారని పేర్కొన్నారు. వక్తలుగా ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సనపల నరసింహమూర్తి, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరరావు, ముస్లిం జెఎసి కన్వీనర్ మహిబుల్లాఖాన్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.వేణుగోపాల్, ఇతర ప్రముఖులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. సెమినార్‌ను జయప్రదం చేయాలని కోరారు.

ఉచితానికి నోచుకునేదెవరో..?

- మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు
- కేబినెట్ ఆమోదం
- దీపావళి నుంచి అమలు
- రెండు, మూడు రోజుల్లో వెలువడనున్న మార్గదర్శకాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఏడాదికి మూడు ఉచిత వంటగ్యాస్ సిలిండర్లను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతిలో బుధవారం నిర్వహించిన కేబినెట్ ఇందుకు ఆమోద ముద్ర వేసింది. దీపావళి నుంచే అమలుకు సిద్ధమవుతోంది. ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు రెండు, మూడు రోజుల్లో వెలువడొచ్చని అధికారులు చెప్తుండడంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది.

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పేరుతో ఆరు హామీలను ఇచ్చింది. వాటిలో ఏడాదికి మూడు వంటగ్యాస్ సిలిండర్ల హామీ కూడా ఉంది. ఆ హామీని దీపావళి నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అసలు ఇది ఎవరికి వర్తిస్తుంది, ఎవరికి వర్తించదు అనే చర్చ మొదలైంది. తమకు ఉచిత గ్యాస్ సిలిండర్ వస్తుందా లేదా అని వినియోగదారుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో మొత్తం 6,92,825 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో సింగిల్ సిలిండర్ల వినియోగదారులు 2,00,264 మంది ఉన్నారు. డబుల్ సిలిండర్ వినియోగదారులు 1,40,054 మంది ఉన్నారు. దీపం కనెక్షన్లకు సంబంధించి 2,10,780 కనెక్షన్లు ఉన్నాయి. డబుల్ సిలిండర్ కనెక్షన్లు 30,558 ఉన్నాయి. ప్రధానమంత్రి ఉజ్వల పథకం గ్యాస్ సిలిండర్లు పొందుతున్న వారు 93,194 మంది ఉన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సిఎస్ఆర్) కింద అందించిన గ్యాస్ కనెక్షన్లు 17,945 ఉన్నాయి.

'దీపం', ఉజ్వల కనెక్షన్లకే వర్తింపజేస్తారా?

దీపం, ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఉన్న వారికే పథకం వర్తించవచ్చంటూ అధికారిక వర్గాల్లో సైతం చర్చ నడుస్తోంది. అందరికీ వర్తింపజేస్తే ప్రభుత్వ ఖజానాపై తీవ్ర భారం పడే అవకాశం ఉన్నందున తక్కువ సంఖ్యలో ఉన్న దీపం, ఉజ్వల కనెక్షన్ల లబ్ధిదారులకే ఇవ్వొచ్చనే చర్చ నడుస్తోంది. పైగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో దీపం కనెక్షన్లు ఇచ్చారని, వారికే ఉచిత సిలిండర్లు దక్కవచ్చనే ప్రచారం సాగుతోంది. ఎన్నికల ముందు మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడం, దీపం కనెక్షన్లన్నీ మహిళల పేరుతోనే ఉండడంతో వారికే ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయనే ప్రచారం సాగుతోంది. ఉజ్వల పథకం లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.300 వరకు రాయితీ ఇస్తోంది. సిలిండర్‌పై ప్రభుత్వం మరో రూ.550 వెచ్చిస్తే వీరూ అర్హులయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.



ఉచితానికి నగదు బదిలీ

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి నేరుగా నగదు బదిలీ స్కీమ్‌ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సిలిండర్‌ను తొలుత లబ్ధిదారులు డబ్బులు చెల్లించి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత సిలిండర్ ధరను ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనుంది. ప్రస్తుతం సిలిండర్ రూ.876 కాగా కేంద్ర ప్రభుత్వం రూ.25 సబ్సిడీ ఇస్తోంది. లబ్ధిదారులు రూ.851కు సిలిండర్‌ను తీసుకంటే, ప్రభుత్వం ఆ మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాలో వేయనుంది. ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనున్న మూడు సిలిండర్లను వరుసగా మూడు నెలల్లో కాకుండా నాలుగు నెలల కాలానికి ఒక సిలిండర్ చొప్పున తీసుకోవాల్సి ఉంటుంది. పథకానికి సంబంధించి మార్గదర్శకాలు వస్తే గానీ ఎవరు అర్హుల్లో, అనర్హుల్లో తెలియదని జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

- నేడు, రేపు జిల్లాకు భారీ వర్ష సూచన
- మండల స్థాయిలో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

'దానా' తుపాను ప్రభావంతో ఈనెల 24, 25 తేదీల్లో జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులు బలంగా వీయనున్నాయని, భారీ వర్షాలు కురుస్తాయనే అంచనాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి కంట్రోల్‌రూమ్ సిబ్బందికి బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నదుల కాలువ గట్ల మరమ్మతులు ఉంటే తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఇసుక బస్తాలను సిద్ధం చేసుకోవాలని, బలహీనంగా ఉన్న చెరువు గట్లను ఇసుక బస్తాలతో మూసి ఉంచాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఐదువేల పైచిలుకు చెరువులు ఉండగా, 1004 చెరువు గట్లు బలహీనంగా ఉన్నాయని తెలిపారు. భారీ వర్షాలకు సామర్థ్యానికి మించి నీరు చేరితే గట్లు తెగే అవకాశం ఉందని, యుద్ధప్రాతిపదికన గట్లను ఇసుక బస్తాలతో పటిష్టం చేయాలని ఆదేశించారు. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కలెక్టరేట్ కంట్రోల్‌రూమ్ ఫోన్ నంబర్ 08942 240557 ద్వారా తుపాను నష్ట సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కంట్రోల్‌రూమ్‌లో ఉండే సిబ్బంది వారికి కేటాయించిన విధులను అత్యంత సమర్థత, నిబద్ధతతో నిర్వహించాలన్నారు. నియోజకవర్గానికి ఇద్దరు చొప్పున, తీర ప్రాంత నియోజకవర్గాల్లో మండలానికి ఒకరు చొప్పున షిఫ్టుల వారీగా సిబ్బంది కాల్స్ చేస్తూ స్థానికంగా నెలకొన్న పరిస్థితులను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ తర్వాత లైన్ డిపార్ట్మెంట్, రిపోర్టింగ్ పార్టీ వెంటనే స్పందించాల్సి ఉంటుందని, క్షేత్రస్థాయిలో నమోదైన సమస్యను పరిష్కరించేంతవరకు నిరంతరం ఫాలోఅప్ చేస్తూనే ఉండాలన్నారు.

తుపాను ప్రభావం ఇచ్ఛాపురం నియోజకవర్గంపై ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నామని, కంట్రోల్‌రూమ్ సిబ్బంది ప్రతి రెండు గంటలకు పూర్తిస్థాయి బులిటెన్ ఇవ్వాలని చెప్పారు. గంట గంటకూ నదీ ప్రవాహాల వేగాన్ని, ఇన్‌ఫ్లో నమోదు చేయాలని ఆదేశించారు. కాల్ సెంటర్‌లో డేటాను గూగుల్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేయాలని, ఇది భవిష్యత్ అవసరాలకు పనికొచ్చేలా ఉండాలని సూచించారు. వర్షపాతం, నదుల్లో ప్రవాహం, ఆస్తుల నష్టం, చెరువులు, వాగుల ఓవర్ ఫ్లో, పునరావాస శిబిరాలు తదితరాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రతి నియోజకవర్గానికి ఒక డ్రోన్, తీర ప్రాంత మండలాల్లో మండలానికి ఒక డ్రోన్ చొప్పున 20 డ్రోన్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో ఆర్‌డిఒలు కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.త్రినాథస్వామి, జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, నీటిపారుదల శాఖ ఎస్ఇ పి.సుధాకర్, ఇపిడిసిఎల్ ఎస్ఇ ఎన్.కృష్ణమూర్తి, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి రాము, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుల అరెస్టు

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు : ఎస్‌పి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పలాసలో ఇద్దరు బాలికలపై అత్యాచార ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పలాసలో ఈ నెల 19న ఇద్దరు బాలికలపై అత్యాచారం జరిగిందని, దానిపై పలాస-కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు. బాధితుల్లో ఒకరికి 17 ఏళ్లు కాగా, మరొకరికి 16 ఏళ్లు అని చెప్పారు. చిన్న అమ్మాయికి సాయి అనే వ్యక్తి ఏడాదిన్నరగా పరిచయముందని తెలిపారు. బాధిత బాలికల తల్లి నిర్వహిస్తున్న టీ దుకాణం వద్దకు సాయి వచ్చి వెళ్తుండేవాడని వివరించారు. ఈనెల 19న సాయి పుట్టినరోజు వేడుకకు ఇద్దరినీ పిలిచాడని చెప్పారు. వీరితో పాటు సాయి స్నేహితులు రాధామోహనరావు, పైల శివను పిలిచాడని తెలిపారు. ముగ్గురు యువకులు మద్యం సేవించారని, తర్వాత బాలికలపై అత్యాచారానికి పాల్పడ్డారని వెల్లడించారు. బాలికలపై అత్యాచారం విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందనే ఉద్దేశంతో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి ముందుకు రాలేదన్నారు. ఈనెల 19న ఘటన జరిగిన తర్వాత 21న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ కేసుపై విచారణ చేపట్టి ఆధారాలు సేకరించామని తెలిపారు. బాలికల వాట్సాప్ చాట్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లు, కాల్ లిస్టు పరిశీలించామన్నారు. బాలికల ఇష్టపూర్వకంగా జరిగినా, జరగకపోయినా ఇద్దరూ మైనర్లు కావడంతో నిందితులపై పోక్సో కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితులు ముగ్గురూ మేజర్లు కావడంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పోర్టు నిర్వాసితుల సమస్యలపై పోరాటం

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

మూలపేట పోర్టు నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే పోరాటాలు తప్పవని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని అక్కవరంలో గల తన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూలపేట పోర్టు దశాబ్దాల కల అని, ఆ కలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నెరవేర్చారని కొనియాడారు. ఆర్ ఆర్ కాలనీలో తాగడానికి ఉప్పునీరే అని, హిరమండలం వంశధార రిజర్వాయర్ నుంచి పైపులైన్ ద్వారా మంచినీరు తీసుకురావాలని డిమాండ్ చేశారు. 40మంది నిర్వాసితులకు ప్యాకేజీ అందలేదని, ఇంకెప్పుడు విడుదల చేస్తారని ప్రశ్నించారు. యూత్ ప్యాకేజీలు వెంటనే విడుదల చేయాలన్నారు. పోర్టులో స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 14 నుంచి పోర్టు పనులు ఆపారని, ప్యాకేజీలు కుదిరాక పనులు ప్రారంభిస్తారా అని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో శరవేగంగా సాగిన పోర్టు పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయాయన్నారు. లేకుంటే పోర్టు నిర్మాణం చివరి దశకు చేరుకునేదని చెప్పారు. స్థానికులకు పోర్టు పనులు కల్పించాలన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పోర్టు తెచ్చామని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. భావనపాడు పోర్టు కోసం 15 వేల ఎకరాల భూసేకరణ పెద్ద స్కామ్ అని అన్నారు. మూడు వేల ఎకరాలతోనే వైసిపి ప్రభుత్వం పోర్టు నిర్మాణం చేపట్టిందని చెప్పారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

రైల్వే హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

ప్రజాశక్తి - ఆమదాలవలస

దానా తుపాను నేపథ్యంలో శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో రైల్వే అధికారులు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. తుపాను ప్రభావంతో ఈనెల 24, 25, 26 తేదీల్లో భువనేశ్వర్, విజయవాడ వైపు వెళ్లే 51 రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. రైల్వే ప్రయాణికులకు ఎటువంటి సమాచారం కావాలన్నా రైల్వే హెల్ప్‌డెస్క్ నంబర్లు 08942 - 286213, 85912, 85913, 85914 సంప్రదించాలని కోరారు.

మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

- సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీ
- పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తి చేయాలి
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రధాన చెక్‌పోస్టుల వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి,ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి గంజాయి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పెండింగ్ సైబర్ కేసుల దర్యాప్తుని సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 'మీకోసం'లో వచ్చే ఫిర్యాదులపై విచారణ చేసి, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల వివరాలను సేకరించి, వారిపై నిఘా ఉంచాలన్నారు. ప్రతి కేసులో దర్యాప్తు పూర్తయిన అనంతరం అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలను కేసు రికార్డుకు జోడించి కోర్టులో అభియోగ పత్రాలను సమర్పించాలన్నారు. ప్రాధాన్యత కేసులు త్వరితగతిన విచారానికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి, కొత్త, అనుమానిత వ్యక్తులు తారసపడితే వారి వివరాలను ఆరా తీయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ నేరాలపై దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, ప్రసాదరావు, పరిపాలన అధికారి సిహెచ్.గోపీనాథ్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవ శ్రీకాకుళం నాల్గవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
OS.No. 3/2024

Between:-
మొదలవలస జోగన్నాయుడు మరియు ఇతరులు
......వాదులు
And:
చింతాటి దాలినాయుడు మరియు ఇతరులు
......ప్రతివాదులు
To,
నోటీస్
చింతాడ మణి, W/o **వెంకటరమణమూర్తి,** శ్రీహరిపురం గ్రామం, ఆమదాలవలస మండలం, శ్రీకాకుళం జిల్లా.
మీపై వాది పై కోర్టులో డిక్లరేషన్ ఆఫ్ టైటిల్ మరియు ఇతర Reliefs కోసం దావా వేసి ఉన్నారు. వాది మీ హాజరు నిమిత్తం చాలాసార్లు సమన్లు బెటా కట్టి యున్నారు కానీ మీరు ఉద్దేశపూర్వకంగా తప్పించుకొనుచున్నారు. అందువలన పై దావాలో మీ హాజరు నిమిత్తం **తేదీ 29-10-2024కు వాయిదా వేసి ఉన్నారు. పై తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టులో పై దావాలో హాజరు కాగలరు. లేని పక్షంలో మీ పరోక్షమున పై దావా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియ జేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
కంచరాన నాగభూషణరావు
న్యాయవాది,
శ్రీకాకుళం, ఫోన్: 9440149767

త్వరలో వైసిపి జిల్లా కమిటీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్ని జిల్లా స్థాయి కమిటీలను త్వరలోనే నియమించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులతో నగరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కమిటీలో అన్ని వర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పించేలా ఉండాలని అభిప్రాయాలు తీసుకున్నారు. పార్టీ అనుబంధ కమిటీలు, పార్టీ ఆఫీసు బేరర్లు, యువజన విభాగం, విద్యార్థి, రైతు, ట్రేడ్ యూనియన్ తదితర విభాగాలను పటిష్టం చేసేందుకు నిర్ణయించారు. ఆయా నియోజకవర్గాలన్నీ సమన్వయం కుదిరేలా అన్ని కమిటీల్లో సమ ప్రాతినిధ్యం కలిగేలా చూడాలని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. వీలైనంత త్వరగా కమిటీలు నియమించి, ప్రకటించాలని తీర్మానించారు. సమావేశంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్, పిరియా సాయిరాజ్, పేరాడ తిలక్, ఎం.వి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పనితీరుపై ఫిర్యాదులు వస్తే చర్యలు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఉపాధి హామీ సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు బి.సుధాకరరావు సూచించారు. మండల కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. సిబ్బంది పనితీరుపై ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి అక్రమాలు జరిగినా కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. పని కోరిన వారందరికీ ఉపాధిని కల్పించాలని స్పష్టం చేశారు. పని ప్రదేశాల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. ప్లాంటేషన్ పనులను త్వరితగతిన శతశాతం పూర్తి చేయాలని, నాటిన ప్రతి మొక్క క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. వ్యక్తిగత తోటల పెంపకంపై రైతులకు అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో ఎపిఒ అప్పలనరసమ్మ, ఇసి జి.రాము, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'మత్తు' బారిన పడితే భవిష్యత్ చిత్తు

ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.వి.జి రాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

యువత మత్తు పదార్థాల బారిన పడితే భవిష్యత్ చిత్తు అవుతుందని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.వి.జి రాజు అన్నారు. సెట్‌శ్రీ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే సామాజిక, మానసిక, శారీరక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వికలాంగ సంక్షేమశాఖ డీడీ కె.కవిత మాట్లాడుతూ ధూమపానం, మద్యపానంతో సరదాగా మొదలయ్యే అలవాటు డ్రగ్స్ వరకు దారితీస్తుందన్నారు. నెహ్రూ యువ కేంద్రం సమన్వయకర్త కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని 1987లో ఐక్యరాజ్యసమితి తీర్మానించిందన్నారు.

మాదక ద్రవ్యాలను అలవాటు పడిన వారిపై దుర్విచక్షణ, నిందలను వదిలేద్దాం వాటి నిరోధాన్ని బలోపేతం చేద్దాం అనే నినాదంతో యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, సెట్‌శ్రీ సూపరింటెండెంట్ ఎల్.రేఖ, ఎక్సైజ్ సిఐ ఇందుమతి, ఎస్ఐ బి.అప్పారావు, పి.లీలారాణి, ఝాన్సీ, అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రౌతు సుమతి మోహనరావు, మూలపేట వివేకానంద యువజన సేవా సంఘం కార్యదర్శి జి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - సోంపేట

నవంబరు 9, 10 తేదీల్లో పలాసలో నిర్వహించే సిపిఎం 18వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు పిలుపునిచ్చారు. సోంపేట మండలం పాలవలసలో సిపిఎం నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 9వ తేదీన ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ సభలో ప్రసంగిస్తారని తెలిపారు. రైతులకు మోసం చేసిన గోల్డెన్ ల్యాండ్ యాజమాన్యంపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలన్నారు. పొత్తంగి గ్రోయన్ నిర్మించాలని కోరారు. జీడి రైతులకు 80 కేజీల బస్తాకు రూ.16 వేల గిట్టుబాటు ధర ప్రకటించి, రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.షణ్ముఖరావు, ఎస్.మోహనరావు, పి.కృష్ణారావు, ఎస్.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT SRIKAKULAM.
I.P. No: 17/2024.

Between:
Dharmaraju Maharana, S/o. late Bhauri Maharana, aged 46 years, presently residing at D.No: 23-175, Indira Nagar Colony, Near Neelakanteswara Swamy Temple, Pallipeta Junction, Narasannapeta town and Mandal, Srikakulam District, PIN :532421, & Others ....Petitioner.
And:
Vakamullu Sreedhar, S/o. late Krishna Rao, Business, D.No: 23-249, Old Bus Stand, Dola buildings, Narasannapeta town and Mandal, Srikakulam District. & Others ....Respondents.

పై నెంబర్‌లో పిటీషనర్‌ను insolvent గా డిక్లేర్ చేయమని కోరుచూ పై నెంబర్‌న పిటిషను దాఖలు చేసినందున సదరు పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **19-11-2024 తేదికి వాయిదా అయివున్నది.** గాన ఇందు విషయమై మీకు ఎవరికైన ఎటువంటి ఆక్షేపనలు ఉన్న యెడల పై తేదిన పైకోర్టులో **ఉదయం 10.30 గం॥ లకు** స్వయంగా కాని లాయర్ గారి ద్వారా గాని హాజరై తెలియపరుచుకొవలెను. లేని యెడల మీ పరోక్షమందు Ex-parte తీర్మాణం జరుగునని యిందు మూలంగా తెలుసుకొనవలెను.
// శ్రీ కోర్టు వారి అనుమతితో //
M.V. KAMESWARA RAO
B.A.,B.L., PGDCM
R. KUSUMA
పిటిషనరు తరుపు న్యాయవాదులు,
శ్రీకాకుళం, ఫోన్: 9441568879.

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఫీజుల వసూళ్లపై ఒత్తిడి చేయొద్దు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు బకాయిపడిన ఫీజులు వసుళ్ల విషయమై వారిపై ఒత్తిడి తీసుకురావద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరిష డిమాండ్ చేశారు. ఈ మేరకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పెషల్ ఫీజులు రద్దు చేయాలని, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు చెందిన డబ్బులు వచ్చిన వెంటనే విద్యార్థులు ఫీజులు చెల్లిస్తారని అన్నారు. సిపిడిసిని రద్దు చేయాలన్నారు. విద్యార్థులకు సమ్మతిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రాన్ని ఆందించిన వారిలో యు.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

కలెక్టర్ దృష్టికి నియోజకవర్గ సమస్యలు

పలాస : పలాస నియోజకవర్గ అభివృద్ధి ఎన్ఆర్ఇజిఎస్ నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను బుధవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాసలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరారు. రామకృష్ణాపురంలోని 220 ఎకరాల అటవీశాఖ భూముల అంశాన్ని ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న కాశీబుగ్గ ఆర్ఓబి పనులను పూర్తి చేయాలని కోరారు. పెండింగ్‌లోఉన్న టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. వంశధార పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరారు. డంపింగ్ యార్డుల పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలన్నారు. ఆమెతో పాటు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు ఉన్నారు.

రేపు మినీ జాబ్‌మేళా

శ్రీకాకుళం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధిశాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా 'మినీ జాబ్ మేళా' కార్యక్రమాన్ని స్థానిక బలగ రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఐటిఐ కళాశాల నందు శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించబడునని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగమేళాలో నాలుగు స్థానిక, బహుళజాతి కంపెనీలు పాల్గొని అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అర్హత గల నిరుద్యోగ యువత వారి విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, మూడు బయోడేటా పత్రాలు జిరాక్స్‌కాపీలు, రెండు ఫోటోలతో హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 78934 54256 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

పోలాకి : మాట్లాడుతున్న తహశీల్దార్ సురేష్‌కుమార్

పోలాకి: భూ రీ సర్వేలోని సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్ అన్నారు. మండలంలోని గాతలవలస పంచాయతీ కొండకొత్తపేటలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారుర.

అనంతరం చెల్లియివలస సచివాలయాన్ని సందర్శించారు. ఆవరణలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సందర్శించిన సమయంలో సచివాలయం చుట్టూ ఆవులు, మేకలు కట్టి ఉండడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ ఆవరణలో ఈ విధంగా ఆవులు, మేకలు కట్టి అపరిశుభ్రంగా ఉంచినవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటువంటి పనులు చేయికుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు.

13 వినతులు

పలాస : మండలంలోని పూర్ణభద్రలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 13 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి తెలిపారు. ముటేషన్ 8, విస్తీర్ణం వ్యత్యాసం సరి చేయాలని ఒకటి, పట్టాదారు పుస్తకాలకు నాలుగు దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సునంద, మండల సర్వేయర్ గిరి, టిడిపి నాయకులు వరిశ తారకేశ్వరరావు పాల్గొన్నారు.

లావేరు: గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేలో సమస్యలుంటే వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం గ్రామసభలు చేపట్టి సమస్యలుంటే వినతిపత్రాలు అందించాలని రెవెన్యూ అధికారులు తెలియ జేయడంతో

లావేరు : మాట్లాడుతున్న తహశీల్దార్ జోగారావు

రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో భూ సమస్యలపై వినతులు కోకొల్లలుగా వస్తున్నాయి. బుధవారం బుడతవలసలో తహశీల్దార్ ఎన్ని జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో రైతులు నుంచి 75 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమం లో రీసర్వే డిటి ఎన్.తిరుపతిరావు, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ రౌతు సురేంద్ర, ఎంపిటిసి ముళ్ల సాయి కుమార్, రైతులు పాల్గొన్నారు.

వైసిపివి నీచ రాజకీయాలు

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

పలాసలో చోటుచేసుకున్న బాలికల అత్యాచార ఘటనపై వైసిపి నీచ రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శ్రీకాకుళం నగరం 80 ఫీట్ రోడ్డులోని విజయ నిలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి అప్పలరాజు వాస్తవాలు తెలుసుకోకుండా ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కుటుంబం పరువు పోతుందని ఫిర్యాదు చేయడానికి తల్లి ముందుకు రాలేదని, చైల్డ్‌రైట్స్ ప్రతినిధులు అడిగినా ఏమీ జరగలేదని బాధితురాళ్ల తల్లి బదులిచ్చిందని చెప్పారు. తాను ఒక మహిళా ఎమ్మెల్యేగా వాస్తవ పరిస్థితిని తెలుసుకునే ప్రయత్నం చేశానని తెలిపారు. బాధితురాళ్ల తల్లితో మాట్లాడి వారికి ధైర్యం చెప్పానని, ఆ తర్వాతే పోలీస్‌స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేశారని చెప్పారు. అత్యాచారయత్నం చేసిన నిందితులను మేము రక్షిస్తున్నామని, తాను సెటిల్‌మెంట్ చేశానని అప్పలరాజు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. తాము బాధితుల పక్షాన నిలబడ్డాం కనుకే నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. వైసిపి హయాంలో పలాస నియోజకవర్గంలో జరిగిన హత్యలపై చర్చకు రాగలవా? అంటూ మాజీ మంత్రి అప్పలరాజుకు సవాల్ విసిరారు.

మాట్లాడుతున్న పలాస ఎమ్మెల్యే శిరీష

వైసిపి ప్రభుత్వ హయాంలో మీనాక్షి హత్యను నువ్వలరేవులో నగేష్ మృతికి రూ.50 లక్షలకు సెటిల్‌మెంట్ చేసింది అప్పలరాజేనని ఆమె గుర్తు చేశారు. ఇప్పటికే పలాస ఘటనకు సంబంధించి నిందితులను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారని వెల్లడించారు. ఘటనపై వాస్తవాలు తెలుసుకోకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని విమర్శించారు. సొంత బాబాయిని గొడ్డలితో నరికి చంపిన జగన్ తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మహిళల రక్షణపై జగన్‌కు మాట్లాడే అర్హత లేదన్నారు. సినీ నటి జత్వానిని వైసిపి నేతలు ఏవిధంగా వేధించారో మరిచిపోయారా? అని ప్రశ్నించారు. తల్లిని, చెల్లిని బైటకి గెంటిన జగన్ ఆడపిల్లలపై మాట్లాడే హక్కు లేదన్నారు. తన ఇంట్లో సెటిల్మెంట్ జరగలేదని నిరూపిస్తే జగన్ అప్పలరాజు ఇద్దరూ బొడిగుండు కొట్టించుకుంటారా? అని సవాల్ విసరారు. మాజీ మంత్రి అప్పలరాజు నోటికి వచ్చినట్టు మాట్లాడితే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పలాస ప్రజలు తిరస్కరించినా అప్పలరాజుకు బుద్ధి రాలేదని చెప్పారు.

సమస్యల పరిష్కారానికే 'ప్రజా దర్బార్'

హిరమండలం: ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలను గాలికి విడిచిపెట్టిందని ఆరోపించారు. ఈ తరుణంలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. భూ వివాదాలు, రోడ్లు, విద్యుత్ సమస్యలు, రేషన్ కార్డులు, ఇళ్లపై దరఖాస్తులు అధికంగా వచ్చాయి. కార్యక్రమంలో రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్యశాఖ, మండల పరిషత్, పంచాతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు. అలాగే గొట్టలో పిఎం జన్మన్ హాస్టల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గిరిజన విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశం అన్నారు. నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి తూలుగు తిరుపతిరావు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరా తయారీలో కురుడు యువకుడు

అజయ్‌కుమార్

కోటబొమ్మాళి: విజయవాడలో రెండు రోజులుగా జరిగిన దేశస్థాయి డ్రోన్ కెమెరా తయారీలో మండలం దంతకు చెందిన శిమ్మ అజయ్‌కుమార్ మూడో స్థానం సాధించారు. ఈయనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, కేంద్ర పౌర విమానశాఖశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతులు మీదుగా బుధవారం రూ.లక్ష నగదు బహుమతిని అందుకున్నారు. అజయ్ కుమార్ తల్లిదండ్రులు జగన్నాథరావు, లక్ష్మిలు వ్యవసాయ కూలీలు. ఈయన పదో తరగతి వరకు కురుడు జిల్లా పరిషత్ పాఠశాలలో చదివాడు. పాలిటెక్నికల్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో, లఖిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 2019 నుంచి డ్రోన్ తయారీలో నైపుణ్యం సంపాదించారు. సుమారు రూ.10 లక్షలు ఖర్చుతో 40 కేజీలు బరువున్న వంద మీటర్లు దూరం ప్రయాణం చేసే భారతదేశంలో మొదటి డ్రోన్ హెలికాప్టర్ 3డి ప్రింటెడ్ టెక్నాలజీ ఉపయోగించి తయారు చేశానని తెలిపారు. ఈ డ్రోన్ హెలికాప్టర్ వ్యవసాయంలోను, యుద్ధాల్లోను మెడికల్ విపత్తుల సమయంలో అత్యంత ఉపయోగకరమని తెలిపారు. అజయ్‌కుమార్‌కు కోటబొమ్మాళి మండల ప్రజలు అభినందనలు తెలియజేశారు.

పాఠశాల పరిసరాల్లో చెత్త తొలగింపు

పొందూరు: మంలంలోని రాపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలను బుధవారం జెసిబి సహాయంతో తొలగించారు. పాఠశాల పరిసరాల్లో స్థానికులు ఇష్టానుసారంగా చెత్తను పడివేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాఠశాల ప్రహరీగోడను ఆనుకుని ఉన్న చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ పనులను సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, పిఎంసి చైర్మన్ కొంచాడ శేషగిరిరావులు పర్యవేక్షించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

లక్ష్మణరావు (ఫైల్)

మండలంలోని గాజుల కొల్లివలస వద్ద జగనన్న కాలనీలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్న కర్రి లక్ష్మణరావు (24) విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. బుధవారం ఉదయం ఎప్పటిలాగే పని చేసేందుకు వెళ్లిన లక్ష్మణరావు సిమెంట్ కలిపేందుకు నీటికోసం మోటార్ వేసేందుకు ఇళ్లు నిర్మించే పక్కన విద్యుత్ స్తంబానికి అమర్చిన ప్లగ్‌బాక్స్‌లో విద్యుత్ వైర్లు అమర్చే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తోటి భవన నిర్మాణ కార్మికులు చెబుతున్నారు. అప్పటివరకు అందరితో కలిసిమెలిసి ఉన్న లక్ష్మణరావు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందడంతో తోటి కార్మికులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుమారుడి మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు సిమ్మయ్య, ఆదిలక్ష్మిల రోధన వర్ణనాతీతం. మృతుడికి అన్న రాము, తమ్ముడు రమేష్ ఉన్నారు. మృతుడికి ఇటీవలే వివాహం నిశ్చయమైందని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పెళ్లి జరగాల్సి ఉందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికి అంది వచ్చిన కొడుకు విగత జీవిగా పడి ఉండటాన్ని చూసి తల్లిదండ్రులు విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఎఎస్ఐ సత్యనారాయణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ మధులత

విద్యార్థి ప్రతిభ

టెక్కలి: స్థానిక ఓక్లాండ్ ఆంతర్జాతీయ పాఠశాలలో చదువుతున్న గౌడు వేదవ్యాస్ అనే విద్యార్థి ఇటీవల ప్రదర్శించిన ఆలితిప్పలు నాటిక ప్రదర్శనలో చూపిన నటనకి మెచ్చి ప్రపంచ స్థాయిలో బాలనటుడిగా గుర్తింపు సంపాదించారు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ మళ్లా మధులత, ఉపాధ్యాయులు వేదవ్యాస్‌ని బుధవారం అభినందించారు. చదువుతో పాటు కళలపైనా విద్యార్థులు దృష్టిసారించాలన్నారు. చిన్నతనం నుంచే నటనలో గుర్తింపుని సంపాదించుకున్న వేదవ్యాస్ ప్రతిభ అభినందనీయమన్నారు.

వెంకటేశ్వరరావుకు అభినందనలు

పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం : విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సిహెచ్.వెంకటేశ్వరరావు బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈయన మీటర్స్ అండ్ ట్రాన్స్‌ఫార్మర్‌లో పనిచేస్తూ... అక్కడి నుంచి ఆపరేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈయనకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ యోగేశ్వరరావు, స్టోర్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, శ్రీకాకుళం డి1 ఎఇ సురేష్, గార ఎఇ కమలహాసన్, రూరల్ ఎఇలు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

రాంబాబు బాధ్యతల స్వీకరణ

రాంబాబు

శ్రీకాకుళం : మీటర్స్ అండ్ ట్రాన్స్‌ఫార్మర్ డిప్యూటీ ఇంజినీర్‌గా బి.రాంబాబు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన విద్యుత్ శాఖలో పనిచేస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈయనకు ఎఇ, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధ్యతగా విధులను నిర్వహిస్తానని తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 302వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బుధవారం దీక్షలో పాల్గొన్న నెలవంక గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ బిడ్డల భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కృష్ణ బిసాయి, హరికృష్ణ బిసాయి, భిమ్మో సాహు, సత్యనారాయణ దొలాయి, సుమన్ బిసాయి, దుదిష్టి మజ్జి పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న నెలవంక గ్రామస్తులు

నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల బాలికలపై జరిగిన అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్ష, కార్యదర్శులు జె.భాగ్యలక్ష్మి, ఎన్.ఢిల్లీశ్వరి డిమాండ్ చేశారు. కాశీబుగ్గలో బాధిత బాలికల కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒకే కుటుంబంలో అక్కాచెల్లెళ్లపై అత్యాచారం చేయడం దారుణమన్నారు. అత్యాచారానికి గురైన అక్కచెల్లెళ్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపై పోక్సో చట్టం కింద కఠినంగా శిక్షించాలన్నారు. జిల్లాలో

మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

మత్తుపదార్థాలు మద్యం విచ్చలవిడిగా పెరగడంతో యువత వాటికి బానిసలై మత్తులో విచక్షణ కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి జీవితం నాశనం చేసుకోవడంతో పాటు అమ్మాయిల జీవితాలనూ నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ పేరుతో కాలయాపన చేయకుండా కఠినంగా శిక్షించాలన్నారు. వీరితో పాటు లావణ్య, జ్యోతి, రజని, గాయత్రి, తరంగిణి పాల్గొన్నారు.

గోవిందరెడ్డిని అభినందిస్తున్న విసి రజని తదితరులు

విసి అభినందనలు

ఎచ్చెర్ల : భువనేశ్వర్‌లో జరిగిన అంతర్జాతీయ ఒడిశా చలన చిత్రోత్సవంలో డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి మునకాల గోవిందరెడ్డి ప్రతిభ కనపర్చాడు. 2023లో విడుదలైన 'గురుకులం' అనే తెలుగు లఘు చిత్రానికి చేసిన ఎడిటింగ్‌కు ఉత్తమ ఎడిటర్ అవార్డును అందుకున్నారు. ఇదే ఏడాది హైదరాబాద్‌లోని ఆదర్శ కళా నిలయం వారిచే స్వర్ణ నంది పురస్కారాన్ని గ్రాఫిక్స్ అండ్ ఎడిటింగ్ కేటగిరిలో ఈయన స్వీకరించారు. ఒకే ఏడాది రెండు అవార్డులు అందుకోవడం, తన కళాప్రతిభతో 'వర్సిటీకి మంచి పేరు తీసుకు రావడంపై గోవిందరెడ్డికి మంగళవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సిహెచ్ రాజశేఖరరావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగపు సమన్వయకర్త డా. ఎన్.మధులత, వర్సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- టెక్కలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుపై దృష్టి సారించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి కోరారు. టెక్కలి, నందిగాం మండలాల యుటిఎఫ్ ప్రతినిధులతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్క ఉపాధ్యాయుడూ ఓటరుగా నమోదై యుటిఎఫ్ బలపరిచిన అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులను ప్యానల్ ఇన్‌స్పెక్షన్ పేరుతో ఉపాధ్యాయులను వేధించడం సబబు కాదన్నారు. ఈ విషయంలో

మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి

మండల విద్యాశాఖాధికారుల వైఖరి మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నందిగాం మండల శాఖ నాయకులు బాలక శంకరరావు, పాలవలస ధర్మారావు, కురమాన దాలయ్య, మారం కుమారస్వామి, కొండేటి అచ్యుతరావు, డొంకాన పాపారావు, చిత్రాడ రమేష్, బాడాన నారాయణరావు, రోణంకి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న నాయకులు

జంగిల్స్ తొలగింపు

ప్రజాశక్తి- పలాస

పలాస ఒకటో వార్డు పరిధిలో నెమలికొండ దత్తాత్రేయ స్వామి ఆలయం రోడ్డులో బుధవారం జంగిల్స్ పనులు చేపట్టారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల ఇచ్చిన పిలుపులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు. నిత్యం రహదారిపై దత్తాత్రేయ స్వామిని దర్శించుకునేందుకు యాత్రికులు వస్తుంటారు. పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో విషసర్పాలు, విష జంతువులు రోడ్డుపై రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో స్వచ్ఛందంగా ప్రొక్లెయినర్‌తో జంగిల్స్ పనులు చేపట్టారు. కార్యక్రమంలో దత్తాత్రేయ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ సవర జగన్నాయకులు, గౌరవ సభ్యులు వి.ఎన్.శర్మ, ఆశ్రమం అధిపతి రాజు, కమిటీ సభ్యులు సాయి, సంతోష్, డి.ప్రకాష్, యుగంధర్ చౌదరి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల బలోపేతమే లక్ష్యం

డివిఇఒ తవిటినాయుడు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఇంటర్మీడియట్ జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి శివ్వాల తవిటినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సరుబుజ్జిలి జూనియర్ కళాశాలను పరిశీలించి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంపుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కమిషనర్ కృతిక శుక్లా ఆదేశాల మేరకు పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజూ కళాశాలకు వచ్చి సమయాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

మాట్లాడుతున్న డివిఇఒ తవిటినాయుడు

ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగేంద్ర, అధ్యాపకులు శ్రీనివాసరావు లైబ్రేరియన్ ఆకెళ్ల రామారావు, రమేష్ సాహు, గొండు శ్రీనివాసరావు, వినోద్ రాజు ఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న సన్యాసినాయుడు

బాల కార్మికుల నిర్మూలనే ధ్యేయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బాలకార్మికుల నిర్మూలనే ధ్యేయమని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయశాఖాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బుధవారం నెహ్రూ రోడ్డులో బాల కార్మికుల నిర్మూలనకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం, ప్రత్యేక రెవ్యూ బృందంతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఒగా సామ్రాజ్యలక్ష్మి బాధ్యతల స్వీకరణ

ఎచ్చెర్ల : డా.బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ ప్రత్యేక అధికారి (ఎస్ఒ)గా డా. కె.సామ్రాజ్య లక్ష్మీ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వర్సిటీలోని పాలనా, ఆర్థిక, పరీక్షల సంబంధిత అంశాలను ఆమె ఎస్ఒ హోదాలో పర్యవేక్షించనున్నారు. గతంలో ఈమె ఎయు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా, జాయింట్ రిజిస్ట్రార్‌గా, ఫైనాన్స్ అధికారిగా, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా సేవలందించారు. నూజివీడు ఐఐటి (ఆర్జీజికెయుటి)కు ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా కూడా పనిచేశారు. 'హిస్టరీ'లో చేసిన పరిశోధనకుగాను 2005లో ఎయు నుంచి డాక్టరేట్ అందుకున్నారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా

వైస్ ఛాన్సలర్‌కు మొక్కను అందజేస్తున్న సామ్రాజ్య లక్ష్మి

వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డా.యు.కావ్యజ్యోత్స్న, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.అనురాధ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది డా. సామ్రాజ్య లక్ష్మికి అభినందనలు తెలిపారు.

సన్మానిస్తున్న గోపాల్

బాబూరావుకు సన్మానం

పలాస : ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావుకు గ్రీన్ ఆర్మీ సంఘం సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన స్వగృహానికి వెళ్లి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, కిషోర్, మధు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న జెడి త్రినాథస్వామి

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

రణస్థలం రూరల్: వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కోరాడ త్రినాథస్వామి సూచించారు. మండలంలోని వల్లభరావుపేట పంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రబిలో ఆరుతడి పంటలు వేసుకోవాలని, పంటమార్పిడి విధానం అనుసరించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల దగ్గర నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. రానున్న రెండు రోజులు తుపాను ప్రభావం ఉన్నందున రైతులందరు కోసిన పంటను జాగ్రత్తగా భద్రపర్చుకోవాలని, తుపాను ప్రభావం తగ్గే వరకు ఎటువంటి వ్యవసాయం చేపట్టవద్దని, అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు వడ్డాది శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు కోరిక మేరకు ప్రభుత్వ రాయితీపై పురుగు మందులు రబిలో అందేలా తమవంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.విజయ్ భాస్కర్, ఉద్యానవన శాఖాధికారి అనూష, దేరాసాం ఎంపిటిసి దన్నాన వంశీ, గురాన రామారావు, బొంతు రమణ, సత్యమప్పడు, రైతులు పాల్గొన్నారు.

కవిటి: యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని శిలగాంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంబించడం ద్వారా మేలైన దిగుబడి సాధించవచ్చని అన్నారు. ఉద్యానవనశాఖ అధికారి మాధవి లత మాట్లాడుతూ కొబ్బరిలో అంతర్ పంటగా కోకో సాగు చేయాలని, నీటి సదుపాయం ఉన్న చోట బిందు, సూక్ష్మ సేద్యం ద్వారా పంటల సాగు చేయాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు పవన్ కుమార్, ఎంపిఇఒ లలితకుమారి, రైతులు బల్లెడ సర్వేశ్వరరావు, బొలియా శెట్టి రమేష్, పూడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : రైతులు చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని పలాస వ్యవసాయశాఖ ఎడి లింగాల వెంకట మధుబాబు అన్నారు. మండలంలోని చాపరలో ఎఒ దానకర్ణుడు ఆధ్వర్యాన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించి సుడిదోమ, పాము పొడ తెగులు, కంకి నల్లి ఆశించి ఉన్నాయని గుర్తించారు. కార్యక్రమంలో నాగభూషణం, వంజరాపు అడివయ్య, దారపు దామోదరరావు, మజ్జి పోలి నాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు పల్లవి పాల్గొన్నారు.

పలాస : సేంద్రీయ ఎరువులు వాడడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయని పలాస వ్యవసాయ శాఖ ఎఒ పోలారావు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు, బొడ్డపాడు జైభీం యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, ఉద్యానవనశాఖ అధికారి శంకర్‌దాస్, టి.పావని పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: దానా తుపానుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎడిఎ జగన్మోహన్ సూచించారు. మండలంలోని తేలుకుంచి, డొంకూరులో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి తుపానుపై అవగాహన కల్పించారు. రైతులకు ఎరువుల వాడకం, చీడ పీడల నివారణ చర్యలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి విషయాపై వివరించారు. కార్యక్రమంలో ఎఒ భార్గవి, సర్పంచ్ పి.రాజశేఖరరెడ్డి, టిడిపి నాయకులు మెరుగు సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆమదాలవలస: సస్యరక్షణతో వరి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు తెలిపారు. బుధవారం మండలంలోని కొరపాంలో పోలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పంటల యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, పంటల్లో వచ్చే చీడ, పీడలు, తెగుళ్ల ఏవిధంగా ఎదుర్కోవాలనే అంశాలపై వివరించారు. పలు రకాల పురుగులు, తెగుళ్లపై చర్చించారు. సుడిదోమ నివారణపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పలాస : అవగాహన కల్పిస్తున్న ఎఒ పోలారావు

పరిశీలిస్తున్న శ్రీకాంత్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కోటబొమ్మాళి: డయేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలనిజిల్లా అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ టి.శ్రీకాంత్ ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రగ్‌స్టోర్స్, లేబరేటరీ, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సంబంధిత అధికారులు శానిటేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఎటువంటి సెలవులు ఇవ్వరాదని వైద్యాధికారులను సూచించారు. డిప్యూటీ పారా మెడికల్ అధికారి సురేష్‌కుమార్, సిహెచ్ఒ మేరీ, హెల్త్ ఎడ్యుకేటర్ చిన్నతల్లి పాల్గొన్నారు.

దరఖాస్తులను స్వీకరిస్తున్న కమిషనర్ రామారావు

ఇళ్ల సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించేందుకే గ్రీవెన్స్ నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు అన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ సమస్యలపై బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లు నిర్మాణాలు చేపట్టి బిల్లులు రాకపోయినా, ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, సిమెంట్, కిటికిలు ఇవ్వకపోయినా తదితర ఏ సమస్యలు ఉన్న ఫిర్యాదు చేయాలన్నారు. దీనిపై పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ గ్రీవెన్స్‌లో ఒక్క దరఖాస్తే వచ్చిందని చెప్పారు. హౌసింగ్ గ్రీవెన్స్ పై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి బుధవారమూ నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశీలిస్తున్న ఎంపిడిఒ వసంతకుమార్

సచివాలయం ఆకస్మిక తనిఖీ

పలాస : మండలంలోని గురుదాసుపురం, మాకన్నపల్లి సచివాలయాలను బుధవారం పలాస ఎంపిడిఒ వసంత కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు రికార్డులను పరిశీలించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల నిర్వహణ బాగుండాలన్నారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేర్వేరు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. ఆయనతో పాటు పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠ రావు, మామిడిమెట్టు సర్పంచ్ ప్రతినిధి గేదెల సూర్య, కార్యదర్శులు ఉన్నారు.

విజయకుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

సేవలే గుర్తింపునిస్తాయి

కవిటి: ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయని సర్పంచ్ పూడి ప్రసాదరావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ అన్నారు. మండలంలోని జగతి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీ అయిన విజయకుమార్‌ను గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయకుమార్ పంచాయతీలో చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఇందుమతి, బావన నారాయణమ్మ, పూడి రాజ్యలక్ష్మి, పూడి హరినారాయణ, బార్ల రాజేష్, బావన నూకరాజు, భావన భాస్కర్, పూడి వంశీ, పూడి కళ్యాణ్, భావన తేజేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేన నాయకుల నిరసన

మెళియాపుట్టి: మండలంలోని ఆకులమ్మతల్లి ఆలయం సమీపంలో ఇటీవల డిప్యూటీ సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు, నియోజకవర్గ ప్రజలకు విజయ దశమి, దీపావళి సందర్భంగా నాయకులు కొరికాన భవాని ఏర్పాటు చేసిన బ్యానర్‌ను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించేశారని నాయకులు వాపోయారు. ఈ మేరకు బేనర్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యానర్లు చించినంతమాత్రాన తమలోని జనసేన ఆశయాలను, అధినేత సిద్ధాంతాలను తగ్గించలేరని అన్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీమాస్త్రంపై రైతులకు అవగాహన

ఎచ్చెర్ల: మండలం మెట్టపేటలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి చంద్రకళ ఆధ్వర్యంలో బుధవారం 200 లీటర్ల నీమాస్త్రం రైతులతో సామూహికంగా తయారు చేశారు. రైతులకు నీమాస్త్రం వలన కలిగే ఉపయోగాలను వివరించారు. ప్రతి పంటకు విత్తిన 20, 45, 60 రోజులకు ఎకరాకు 200 లీటర్ల నీమాస్త్రం పిచికారి చేయాలని సూచించారు. నీమాస్త్రం అన్ని రకాల పురుగుల గుడ్లు చంపుతుందని, రసం పీల్చే పురుగులను, చిన్న గొంగళి పురుగులను నివారిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- రణస్థలం

అల్పపీడన ప్రభావంతో సముద్ర తీర ప్రాంతాల్లో అలజడిగా మారనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డివిజనల్ పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి ఐ.వి.రమణ అన్నారు. బుధవారం కోటపాలెంలోని విజయరామ చెరువు ఆనకట్టను పరిశీలించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుఫాను తీవ్రం అయ్యే అవకాశం ఉన్నందున మండల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సముద్ర, నదీతీర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందుస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని కార్యదర్శి ఆర్.శ్రీధర్‌ను ఆదేశించారు. వైద్య, రెవెన్యూ, పోలీసుశాఖలతో పాటు సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. అత్యవసరమైన వారు ఫోన్‌లో సంప్రదించే విధంగా కంట్రోల్ రూమ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ సుంకర ధనుంజయ,

రణస్థలం : అధికారులకు సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి రమణ

సర్పంచ్ గొర్లె జగదీష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తదితరులున్నారు.

పొందూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన దానా' తుపానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ మీసాల మన్మధరావు కోరారు. మండలం కృష్ణాపురంలో బుధవారం సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, మొక్కజొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పలు సచివాలయాలను సందర్శించి తుపానుపై అప్రమత్తం చేశారు. ఈయనతో పాటు ఇఒపిఆర్‌డి పి.సింహాచలం, ఎపిఒ శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీను తదితరులు ఉన్నారు.

పాతపట్నం : దానా తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం మేజర్ పంచాయతీ సర్పంచ్ సిర్ల జోగారావు సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దన్నారు. శిథిల భవనాలు ఉండరాదన్నారు. ముందస్తుగానే సరుకులను కొనుగోలు చేసుకోవాలన్నారు. మేకలు, పశువులను, జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. రైతులు వరి కోతలను కోయకుండా ఉండాలన్నారు.

మెళియాపుట్టి : తుపాను హెచ్చరికల దృష్ట్యా మండల ప్రత్యేకాధికారి, పలాస వ్యవసాయ శాఖ ఎడి లింగాల మధుబాబు మండల అధికారులతో మండలంలో పర్యటించారు. చాపర వద్ద ఉన్న పెద్ద చెరువు, సెల్ టవర్లను పరిశీలించారు. ఈయన వెంట ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా ఉన్నారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న వరప్రసాదరావు

టిపిఒ బాధ్యతల స్వీకరణ

పలాస: పలాస మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిగా ఎస్.వరప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ టిపిఒగా పనిచేసిన అప్పలరాజు విజయ నగరానికి బదిలీ అయ్యారు. విశాఖ జివిఎంసిలో పనిచేసిన వరప్రసాదరావు టిపిఒగా బదిలీపై వచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో సర్వేయర్ చంద్రశేఖర్ ఉన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

పొందూరు: మండలం తాడివలస పంచాయతీ లచ్చయ్యపేటలో శ్రీకాకుళానికి చెందిన డా.శశిధర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగావైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 120 మందికి పలు వైద్యపరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డా.అన్నెపు శశిధర్, ఆర్గనైజర్ రాజ్‌కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే గౌతు శిరీష

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా చేస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు పెసరపాడులో రూ.10 లక్షలు సాధారణ నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసిపి హయాంలో ఐదేళ్లలో మున్సిపాలిటీలో ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టిన దాఖలాలు లేవని అన్నారు. అక్కడక్కడ చేపట్టిన అభివద్ధి పనులు కెటి రోడ్ మాదిరిగా అసంపూర్ణంగా విడిచిపెట్టేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో రాజకీయాలకతీతంగా అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతి పాదనలు చేయాలని మున్సిపాలిటికి సూచించామన్నారు. దశలవారీగా మున్సిపాలిటీని అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, బడ్డ నాగరాజు, అంబటి కృష్ణమూర్తి, కమిషనర్ ఎన్.రామారావు, డిప్యూటీ ఇంజినీర్ కనకరాజు, ఎఇ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- రణస్థలం

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లిలో అసిరితల్లి గ్రామదేవత ఉత్సవాలు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సౌజన్యంతో జైభీమ్ యూత్ అధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ నిర్వహించారు. ఈ టోర్నిలో సుమారు 20 జట్లు పాల్గొనగా మొదటి బహుమతి పలాస జట్టుకు రూ.15 వేలు, రెండువ బహుమతి లావేరు మండలం మురపాక జట్టుకు రూ.10 వేలు, తృతీయ బహుమతి రణస్థలం మండలం పాతర్లపల్లి జట్టుకు రూ.7 వేలతో పాటు షీల్డ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రణస్థలం ఎంపిపి ప్రతినిధి, వైసిపి జిల్లా

బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయి కుమార్, పాతర్లపల్లి సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, నాయకులు మహంతి వెంకటప్పల నాయుడు, గొర్లె సీతారాం (ముఠామేస్త్రి), నేతల కృష్ణ, కులపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సుల నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నూతన కార్యవర్గం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ నూతన జిల్లా కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. అధ్యక్షులుగా పి.శాంతికుమారి, సహాధ్యక్షులుగా ఎస్.చిన్నమ్మి, సెక్రటరీగా ఎల్.త్రినాథమ్మ, ట్రెజరర్‌గా పి.సత్యవతి ఎన్నికయ్యారు. వీరితో పాటు ఐదుగురు ఇసి మెంబర్లను ఎన్నుకున్నారు. వీరికి ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు, జెఎసి చైర్మన్ హనుమంతు సాయిరాం శుభాకాంక్షలు తెలిపారు. సంఘం బలోపేతానికి తమవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. సంఘటితంగా పనిచేసి సంఘం బలోపేతానికి కృషి చేయాలని నూతన కార్యవర్గానికి సూచించారు. ఎన్నికల అధికారిగా కె.దామోదరరావు, ఎన్నికల పర్యవేక్షకులుగా పూజారి జానకీరామ్ వ్యవహరించారు. తమ ఎన్నికకు కృషి చేసిన ప్రతిఒక్కరి సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తామని, సంఘం నిబంధనల మేరకు పనిచేసి సభ్యులలో మంచి గుర్తింపు, గౌరవం తెచ్చుకుంటామని నూతన అధ్యక్షులు శాంతి కుమారి తెలిపారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పలువురికి ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు : మండలంలోని పూడిజగన్నాథపురానికి చెందిన తిమ్మల అప్పలస్వామి ఇటీవల మృతి చెందారు. ఇద్దరు చిన్న వయసు ఆడ పిల్లలు ఉన్న ఆ కుటుంబం వీధిన పడింది. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు వచ్చారు. రూ.1,65,000 సుకన్య సమృద్ధి యోజన పథకం కింద బ్యాంకులో ఆ పిల్లలు పేరున ఫిక్సడ్ డిపాజిట్ చేసి బుధవారం ఆ బాండ్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తిన ప్రసాద్, మాజీ సర్పంచ్ తిమ్మల కష్ణారావు, జి.ఆదినారాయణ, దుమ్ము కోదండరావు, టి.సాంబమూర్తి, తిమ్మల గణపతి, గర్తం మోహనరావు, దూపాన కూర్మారావు, బి. సోమేష్, తిమ్మల జయరాం పాల్గొన్నారు.

పాతపట్నం : మండలంలోని కాగువాడకు చెందిన కూర్మాన దాసు నాయుడు కుమారుడు ఓ ప్రమాదంలో రెండు కాళు విరిగిపోయాయి, కళ్లు కనిపించకుండా ఉన్నాయి. దీంతో మంచానికే పరిమితమయ్యారు. వైద్యం కోసం డబ్బులేక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న జనసేన నాయకురాలు కొరికాన భవాని స్పందించి వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నక్క క్రాంతికుమార్, సంతోష్‌నాయుడు, మనోజ్, శంకర్, సాయి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని సీతన్నపేటకు చెందిన ఇప్పిలి త్రినాథ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. వైద్యం చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కొత్తపేటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సభ్యులు బుధవారం రూ.10వేలు ఆర్థిక సహాయం అందిచారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక, ఆరోగ్య పరిస్థితి బాగులేని త్రినాథ్‌కు ఆర్థికసాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఇరానీ టీ రాజు, రవి, సంతు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షకు చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో సమాజ్ పరివర్తన్ సంస్థ బుధవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ మెటీరియల్‌ని సక్రమంగా వినియోగించి ఒక ప్రణాళిక ప్రకారం చదివితే ఎక్కువ మంది ఉత్తమ ఫలితాలను సాధించి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాలని సమాజ్ పరివర్తన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.నరేష్ కోరారు. ప్రభుత్వం అందించే ఇటువంటి స్కాలర్‌షిప్ పేద కుటుంబాలకు ఒక మంచి సహకారంగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఒక లక్ష్యంగా సాధనకు

స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న నరేష్

కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు ఎ.గోవిందరావు అన్నారు. సమాజ్ పరివర్తన్ స్టీరింగ్ కమిటీ మెంబర్ బి.చంద్రరావు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కె. వెంకటరమణ, కో-ఆర్డినేటర్ తిరుపతిరావు పాల్గొన్నారు.

'అపార్' పూర్తికి చర్యలు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించి వివరాలు నమోదు దృష్ట్యా ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన అపార నమోదుపై ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు సూచించారు. మండలంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో బుధవారం వెబెక్స్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ప్రతిఒక్క విద్యార్థి పూర్తి వివరాలతో పొందుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌పిడి శ్రీనివాసరావు కూడా సూచనలు చేశారు. టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి విలియమ్స్, ఎంఇఒలు తులసీరావురెడ్డి, చిన్నారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండలం మండల విద్యాశాఖ కేంద్రంలో మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత ప్రధానోపాధ్యాయులతో కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు, ఎస్‌పిడి శ్రీనివాస రావులు వెబెక్స్ నిర్వహించారు. అపార్ ఐడి కార్డులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ అప్పారావు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

మినీ గోకులాల ఏర్పాటు వేగవంతం

ప్రజాశక్తి- పోలాకి

ఉపాధి హామీ ద్వారా మంజూరైన మినీ గోకులాలు ఏర్పాటు వేగవంతం చేయాలని ఇసి మునీంద్ర ఆదేశించారు. మండలంలోని చెల్లాయివలస పరిధిలో అంబీరుపేటలో ఏర్పాటు చేస్తున్న మినీ గోకులాలను బుధవారం పరిశీలించారు. గోకులాలకు ఏర్పాటు చేసిన షెడ్ల నిర్మాణం, పొడవు, వెడల్పు తదితర అంశాలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఐదు మినీ గోకులాలు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో తలసముద్రం మూడు, అంపలాం ఒకటి, పల్లిపేట ఒకటి మంజూరయ్యాయని అన్నారు. ఈ పథకం ద్వారా రెండు ఆవులు ఉన్న యూనిట్‌కి రూ.1,15,000, నాలుగు ఆవులు ఉన్న యూనిట్‌కి రూ.1,85,000, ఆరు ఆవులు ఉన్న

పరిశీలిస్తున్న ఇసి మునీంద్ర

యూనిట్‌కి రూ.2,30,000 మంజూరు చేసినట్లు చెప్పారు. అయితే ఇందులో 90 శాతం ప్రభుత్వం మంజూరు చేయగా, 10 శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉంటుందన్నారు. ఇంకా ఆసక్తి కలిగిన వారు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టిఎ రామకృష్ణ, రైతులు మల్ల కృష్ణమూర్తి, మల్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వసతిగృహానికి తాగునీటి సౌకర్యం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలోని ఎస్‌సి వసతిగృహానికి తాగునీరు పైప్‌లైన్‌ను పంచాయతీ అధికారులు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ఎస్‌సి వసతిగృహాన్ని ఈనెల 1న సివిల్‌జడ్జి బి.జ్యోత్స్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తాగునీటి సమస్యతో పాటు, పలు సమస్యలను

తెలియజేశారు. దీంతో త్వరితగతిన వసతిగృహానికి తాగునీరు సరఫరా చేయాలని పంచాయతీ కార్యనిర్వాహణ అధికారి మోహన్‌బాబును ఆమె ఆదేశించారు. దీంతో న్యాయమూర్తి ఆదేశాల మేరకు తాగునీరు పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి తాగునీరును సరఫరా చేశారు. ఎట్టకేలకు వసతి గృహానికి తాగునీరును సరఫరా చేయడంతో విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేశారు.

పలాస : మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రరావు

పోలీసుల త్యాగాలను గుర్తించాలి

ప్రజాశక్తి- టెక్కలి

సమాజంలో ప్రజల మాన, ధన, ప్రాణాలకు రక్షణ కల్పించే పోలీసుల త్యాగాల్ని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎఎస్ఐ ఎర్రన్నాయుడు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ అధ్యక్షతన బుధవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజం కోసం చేసిన పోరాటాలతో పాటు ఉద్యమ చరిత్రలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ లీలాపద్మజ, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కానిస్టేబుల్ మోహనరావు పాల్గొన్నారు.

పలాస : పోలీసుల విధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ ఎస్ఐ మెట్ట చంద్రరావు సూచించారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులకు పోలీసుల విధులపై అవగాహన కల్పించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుపై దృష్టి సారిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు.